సిద్ధమవుతున్న బొజ్జ గణపయ్య



వినాయక విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు



బాలగణపతి

- 3 నెలల ముందుగానే చేరుకున్న కోల్‌కతా కళాకారులు
- తోటపోలమాంబ ఆలయం వద్ద తయారీ
- గతేడాది కంటే గిరాకీ తగ్గిందంటున్న తయారీదారులు



వినాయక చవితికి సిద్ధమవుతున్న విగ్రహాలు



శేషశయనుడిగా విఘ్ననాయకుడు

గోపాలపట్నం: వినాయక చవితి సమీపించడంతో బొజ్జ గణపయ్య విగ్రహాలు చకచకా తయారవుతున్నాయి. పెద్ద విగ్రహాలను ఆర్డర్లకు అనుగుణంగా రూపొందిస్తున్నారు. కోల్‌కతా నుంచి వచ్చిన 12 మంది కళాకారులు మూడు నెలల ముందుగానే నగరానికి చేరుకున్నారు. తోలపోలమాంబ ఆలయం వద్ద వీరు గుడారాలు వేసుకుని విగ్రహాలను రూపొందిస్తున్నారు. వారికి పనితనాన్ని బట్టి జీతాలు రూ.10వేల నుంచి రూ.70వేల వరకు ఉంటాయని తెలిపారు. నైపుణ్య గలవారికి రోజుకు రూ.2 వేల వరకు కూడా కూలి ఉంటుందని చెప్పారు. జూన్ నెలలో నగరానికి చేరుకునే వీరు, గణపతి విగ్రహాల తయారీ అనంతరం దుర్గాదేవి ప్రతిమలను, విగ్రహాలను తయారు చేస్తారు. దసరా అనంతరం తిరిగి తమ సొంత ప్రాంతాలకు వెళ్తారు. సుమారు 10 సంవత్సరాల నుంచి విశాఖ వస్తున్నామని వారు తెలియజేశారు.

అభిరుచికి అనుగుణంగా తయారీ

చిన్న విగ్రహాలను చాలామంది అప్పటికప్పుడే కొనుగోలు చేసి తీసుకువెళ్తారు, కానీ పెద్ద విగ్రహాలను 3 నెలల ముందుగానే ఆర్డర్ ఇచ్చి తీసుకువెళ్తారని చెబుతున్నారు. కొందరు తమ వద్ద ఉన్న విగ్రహాల నమూనాను సెల్‌ఫోన్‌లో తీసుకువచ్చి ఆర్డర్ ఇస్తారని, వారి అభిరుచికి అనుగుణంగా విగ్రహాలను రూపొందిస్తున్నామని తయారీదారులు తెలిపారు. ఇక్కడ రూ.5 వేల నుంచి లక్ష రూపాయల వరకు విగ్రహాలు అందుబాటులో ఉంటున్నాయి. అయితే భారీ విగ్రహాలు మాత్రం ముందుగా చెబితేనే అందివ్వగలమని తెలిపారు.

తయారీ ఇలా..

విగ్రహం తయారీకి ముందుగా కర్రలు, గడ్డితో ఆకృతిని తయారు చేస్తారు. దానిపై మట్టితో పూర్తి స్వరూపం చేస్తారు. అనంతరం వాటికి డిజైన్లు వేసి, రంగులద్ది ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. విగ్రహం తయారీకి ముడి సరకులన్నీ ఇక్కడివే అని తయారీదారులు తెలిపారు. మట్టిని పెందుర్తి నుంచి తీసుకువస్తామన్నారు.

కష్టమే మిగులుతోంది



మాకు కష్టమే మిగులుతోంది. విశాఖపట్నానికి చాలా ఏళ్ల నుంచి వస్తున్నా. గిరాకి పెరగడం లేదు. ముడిసరకు ధరలు పెరిగిన రీతిలో విగ్రహాల రేట్లు పెరగడం లేదు. మెయింటెనెన్స్ పెరిగింది. కూలీలు పెరిగాయి. కానీ విగ్రహాల ధరలు మాత్రం అనుకున్న స్థాయిలో లేవు. గతేడాది రూ.10 వేల విగ్రహం, ఈ ఏడాది రూ.12వేలు అయితే కొనేవారే లేకుండా ఉన్నారు. అలవాటు పడ్డాం కనుక, వ్యాపారాలు సాగిస్తున్నాం

– అమర్ సింగ్ శక్తిపాల్, కోల్‌కతా

మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం



మేమంతా మట్టి విగ్రహాలకే ప్రాధాన్యతనిస్తాం. మా వద్ద ఉన్న విగ్రహాలు చూపిస్తాం. లేదా వినియోగదారులు ఫోన్లో చూపించిన నమూనా ప్రకారం విగ్రహాలను తయారు చేస్తాం. హావభావాలు, రంగులు అన్నీ వారు కోరుకున్నట్లే మా కళాకారులు తయారు చేస్తారు. నైపుణ్యం గలవారికి ఎక్కువ జీతం ఇస్తున్నాం. అలాంటివారికి రోజుకు రూ.2000, అంతకంటే ఎక్కువే ఇస్తున్నాం.

– శక్తిపాల్, కోల్‌కత్తా

తగ్గిన ఆర్డర్లు

వినాయక విగ్రహాల ఆర్డర్లు గతంలో కంటే బాగా తగ్గాయని తయారీదారులు చెబుతున్నారు. ముడి సరకుల ధరలు పెరిగినంతగా విగ్రహాల ధరలు పెరగడం లేదని, దీంతో పెట్టుబడి పెరుగుతోంది తప్ప లాభాలు పెద్దగా రావడం లేదని తెలియజేశారు. సాధారణంగా ఒక సీజన్‌కు అన్ని ఖర్చులు కలిపి రూ.15లక్షల నుంచి రూ.17 లక్షల వరకు అవుతుందని తెలిపారు. గతేడాది 70 నుంచి 100 మూర్తుల వరకు తయారు చేశామని, ఈ ఏడాది 50 మాత్రమే చేస్తున్నామని చెప్పారు.

క్లుప్తంగా

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ



నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మల్కాపురం క్రైం ఎస్‌ఐ రమణ

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో నేరాల నియంత్రణకు.. శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మల్కాపురం క్రైం ఎస్‌ఐ ఎంవీ రమణ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద సోమవారం ప్రజలకు నేరాల నియంత్రణకు ఏ విధంగా సహకరించాలనే విషయంపై అవగాహన కల్పించారు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు గ్రామ ప్రజలు సహకారం కావాలని కోరారు. అదే విధంగా గ్రామ సరిహద్దుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను నియంత్రించేందుకు, నేరస్తులను పట్టుకునేందుకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలి



అధికారులకు సూచనలిస్తున్న గణబాబు

విశాఖ విద్య: ఎయిర్‌పోర్టు దారిలో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే గణబాబు సంబంధిత అధికారులకు సూచించారు. ఇంజినీర్ అధికారులు , ట్రాఫిక్ పోలీసు అధికారులతో సోమవారం ఎయిర్‌పోర్ట్ నుంచి విమాన్‌నగర్ రోడ్‌లో పర్యటించారు. కొత్తపాలెం, విమాన్‌నగర్ నుంచి వచ్చే ద్విచక్ర వాహనదారులు క్రమపద్ధతిలో వెళ్లేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. విమాన్ నగర్ నుంచి ఎయిర్‌పోర్ట్ జంక్షన్‌కి ప్రత్యామ్నాయ మార్గం ప్రతిపాదించాలన్నారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో వీఎస్ టీమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక చవితి మహోత్సవాలకు సోమవారం పందిరి రాట వేశారు. 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, అసోసియేషన్ చైర్మన్ ఆదారి నాగరాజు, సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న చవితి మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, మీరా, రామకృష్ణ పాల్గొన్నారు.

'భారతీయ వైజ్ఞానిక వైభవం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య నాగేశ్వరరావు

మురళీనగర్: నేటి వైజ్ఞానిక పురోగతికి మూలాలు భారతీయ శాస్త్ర గ్రంథాల్లో ఉన్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో చెరుకూరి సర్వేశ్వరరావు రచించిన భారతీయ వైజ్ఞానిక వైభవం గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రపంచంలోనే మన ఆయుర్వేదం అతి ప్రాచీన వైద్య విజ్ఞానమని పేర్కొన్నారు. మన వైజ్ఞానికుల కృషిని తెలుగులో సరళమైన శైలిలో చెరుకూరి సర్వేశ్వరరావు అందించారన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేస్తూ ఆరుగురు శాస్త్రవేత్తల జీవిత విశేషాలు గ్రంథం చేయడం అభినందనీయమన్నారు. వారి గ్రంథాల్లోని పలు రకాల చికిత్స విధానాలు, శరీర నిర్మాణం, మానసి రుగ్మతలకు సంబంధించిన అనేక విషయాలను చాలా లోతుగా పరిశీలించి గ్రంథాన్ని రూపొందించారని చెప్పారు. గౌరవ అతిథి డాక్టర్ కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి, ఆచార్య పీఎస్‌ఆర్ అవధాని, ఆచార్య కె.విశ్వనాథ్, శేఖరమంత్రి ప్రభాకరరావు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే దొంగతనం

- నిందితుల అరెస్ట్
- చోరీసొత్తు స్వాధీనం
- క్రైం సీఐ శ్రీనివాసరావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గోపాలపట్నం: ఈ నెల 9న గోపాలపట్నం లక్ష్మీనగర్‌కు చెందిన యరబాల నారాయణరావు ఇంట్లో జరిగిన చోరీ కేసును క్రైం పోలీసులు ఛేదించారు. ఈ మేరకు సోమవారం క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. పథకం ప్రకారం తాళం వేసిన ఇంట్లో ఐదున్నర తులాల బంగారం దొంగతనానికి పాల్పడ్డారని సీఐ తెలిపారు. లక్ష్మీనగర్‌కు చెందిన యరబాల నారాయణరావు కుటుంబ సభ్యులతో శ్రీకాకుళం పెళ్లికి వెళ్లాడు. అదే రోజు రాత్రి తాళాలు పగలగొట్టి ఐదున్నర తులాల బంగారం దోచుకెళ్లారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బాధితుడు 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితుడు తెలిపిన వివరాలతో క్లూస్ టీమ్ దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను అంచనా వేశారు. సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు అధికారి జి. తేజేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ఇందులో భాగంగా అపనుమానితుల్ని అడివివరం దరి లండగరువు వద్ద కొత్తపల్లి జయరామ్, ఈత ఇంద్ర, బోగాది అప్పలనాయుడు(గేదెల అప్పలనాయుడు)లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం వెల్లడైంది. ముద్దాయి బోగాది అప్పలనాయుడుతో బాధితుడు శ్రీకాకుళం వెళ్తున్నట్లు చెప్పాడని.. ఇంట్లో ఎవరూ ఉండరన్న నమ్మకంతో దొంగతనానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.

బంగారం రికవరీ

చోరీ చేసిన బంగారాన్ని నిందితులనుంచి రికవరీ చేశారు. చేతి బ్రాస్‌లెట్, బంగారు గొలుసు, నాలుగు ఉంగరాలు, జత చెవిరింగులు స్వాధీనం చేసుకున్నారు.

రక్షణ గోడల నిర్మాణానికి శంకుస్థాపన

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతి నగర్ కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. క్రాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లో సుమారు రూ.15 లక్షలతో రక్షణ గోడల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇటీవల తొలగించిన 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు భూములు ఇచ్చి ఎన్నో ఏళ్లుగా ప్లాంట్‌లో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులను కూడా తొలగించడం అన్యాయమన్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో మాట్లాడి కార్మికుల అంశంపై చర్చిస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో వీధి కుక్కల బెడద

ఇద్దరిపై దాడి



మల్కాపురం ప్రాంతంలో వీధి కుక్కల సంచారం



వీధి కుక్క దాడిలో గాయపడిన వ్యక్తి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. మల్కాపురం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలు సోమవారం ఓ వ్యక్తితో పాటు బాలుడిపై వేరు వేరు చోట్ల దాడి చేశాయి. వారు ఆస్పత్రులకు పరుగులు తీసి వైద్యం చేయించుకున్నారు. వీధి కుక్కల సంచారం అధికంగా ఉన్నా స్పందించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో సమస్య అధికమవుతోంది. స్కూల్ నుంచి వస్తున్న బాలుడిపై మల్కాపురం మార్కెట్ వీధి వద్ద వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.స్థానికులు గుర్తించి వీధి కుక్కలను తరిమివేసి, ఆ బాలుడిని ప్రైవేట్ ఆస్పత్రికి వైద్యం కోసం తీసుకు వెళ్లారు. వీధి కుక్కలను పట్టుకునే సిబ్బంది ఎప్పుడో ఓ సారి వచ్చి పేరుకు రెండు కుక్కలను పట్టుకుని ఫొటోలు తీసుకుని అక్కడితో పని అయిపోయిందని వెళ్లిపోతున్నారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేస్తే వీధి కుక్కలు పెరిగే అవకాశాలు ఉండవు. కానీ ఆ దిశగా అధికారులు ఆలోచన చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వ్యర్థాలు తొలగించరూ!



మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వద్ద వ్యర్థాలపై చేరిన పశువులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో వ్యర్థాలను నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు. వీటిని సకాలంలో తొలగించకపోవడంతో ఆ ప్రాంతంలో పశువులు చేరుతున్నాయి. నిత్యం సమస్య ఉన్నా వార్డు శానిటరీ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సేవా మార్గంలో వ్యర్థాలు డంప్ చేయకుండా ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు జరిమానాలు విధించాలని పలువురు కోరుతున్నారు.

సుర్రుమంటున్న సూరీడు



జింక్ సేవా మార్గం ఎండలో మండుతున్న చిరు వ్యాపారులు

- వర్షాకాలంలో భానుడి సెగ
- విలవిల్లాడుతున్న వృద్ధులు, ఫుట్‌పాత్ వ్యాపారులు



మల్కాపురం వద్ద ఎండలో అరటిపళ్లు విక్రయిస్తున్న వృద్ధురాలు

మల్కాపురం: వర్షాకాలంలో వింతవాతావరణం ఆవిష్కృతమవుతోంది. ఎండాకాలాన్ని మించి భానుడు మండుతున్నాడు. సామన్య జనం రోడ్డుపైకి వచ్చేందుకు భయపడే పరిస్థితి ఏర్పడింది. మే,జూన్,జూలై నెలల్లో మించిన ఎండలు ఆగస్టు నెలలో ఉన్నాయి. వాస్తవానికి ఈ నెలలో వర్షాలు దండిగా కురవాలి. అందుకు విరుద్ధంగా ఎండలు కాస్తున్నాయి. ఎండల వేడికి పారిశ్రామిక ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుని చిరు వ్యాపారులు,వివిధ పరిశ్రమల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులు,భవన నిర్మాణ కార్మికులు విలవిల్లాడుతున్నారు.దేవుడా ఎప్పుడు ఈ ఎండలు తగ్గుముఖం పడుతాయో అని వారు ఆశగా వరుణుడి వైపు ఎదురు చూస్తున్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

గాజువాక: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కేజీల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వాడ ప్రాంతానికి చెందిన తిలపాల నాని, గాజువాక డిపో ప్రాంతానికి చెందిన జడ్డా రమేష్, ములగాడ ప్రాంతానికి చెందిన గురజాపు నితీష్ అరకులో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి నాలుగు కేజీల గంజాయి కొనుగోలు చేసి రెండు ద్విచక్ర వాహనాలపై గాజువాక తీసుకొస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గాజువాక ఎస్‌ఐ ఎల్.సూర్యకళ జింక్ మైదానంవద్ద తనిఖీ చేపట్టారు. జింక్‌లోకి ప్రవేశిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఆమెను చూసి వెనక్కి వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్‌ఐ వారిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆరా తీశారు. తాము గంజాయి కొనుగోలు చేశామని, గాజువాక ప్రాంతంలో ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి తీసుకొచ్చినట్టు నిందితులు చెప్పారని సీఐ పార్థసారథి పేర్కొన్నారు. గంజాయితో పాటు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్ నియంత్రించి... 108కి తోవ ఇచ్చి..



108 వాహనాన్ని జంక్షన్‌ను దాటిస్తున్న యువకుడు



రద్దీతో నిలిచిన వాహనాలు

గోపాలపట్నం: సామాజిక బాధ్యతతో వ్యవహరించాడు.. శభాష్ అనిపించుకున్నాడు ఆ యువకుడు. ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108 వాహనాన్ని పంపించేందుకు ట్రాఫిక్ పోలీసయ్యాడు సామాన్య యువకుడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో సప్తగిరి జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. సాయంత్రం ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం వల్ల జంక్షన్‌లో 108 వాహనం నిలిచి పోయింది. ఇది గమనించిన యువకుడు(వివరాలు తెలియలేదు)వెంటనే స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాడు. తొలుత 108 వాహనాన్ని పంపించాడు. ఆ తర్వాత వాహనాలను నియంత్రిస్తూ రద్దీని క్రమబద్ధీకరించాడు. యువకుడు చూపిన చొరవను చూసిన వారంతా మెచ్చుకున్నారు.

రోడ్డున పడేయవద్దని ఆటో కార్మికుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

మహారాణిపేట: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడం వల్ల తమ ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆటో కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక, ఉన్నత చదువులు చదువుకున్న వారికి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేకపోవడంతో ఆటో మోటార్ రంగాన్ని ఎంచుకుని కుటుంబాలతో బతుకుతున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడతారని, ఈ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు మాట్లాడుతూ ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా రూ.50 వేలు కట్టి ఆటోలు కొన్నామని, ఇప్పుడు ప్రయాణికులు ఎక్కకపోతే నెలసరి వాయిదాలు కట్టడం కష్టంగా మారుతుందన్నారు. సంఘ నాయకుడు షేక్ రెహ్మాన్ మాట్లాడుతూ మోటార్ కార్మికులకు జాతీయ బ్యాంకుల ద్వారా డ్వాక్రా మహిళలకు ఇచ్చేలా పావలా వడ్డీకే వాహనాలకు రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాహన మిత్ర పథకం వెంటనే అమలు చేయాలని, పీఎఫ్, ఇతర సదుపాయాలతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో–మోటార్ డ్రైవర్లకు సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.15 లక్షలు మంజూరు చేయాలనికోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హేమంత్, కె.శివ, శివాజీ, శ్రీను, అవతారం, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఖాళీలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న నాయకుడు అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీ పారిశుధ్య విభాగంలో పదవీ విరమణలు పెరుగుతున్నాయి... అకాల మరణాలు నమోదవుతున్నా ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్న కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకుడు గొలగాని అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1లో పాశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవీ విరమణ, మరణించిన వారి వారసులను నియమించాల్సి ఉండగా ఉపాధి కల్పించడం లేదన్నారు. అలాగే అప్పట్లో పుట్టిన తేదీలు సరిగా తెలియపోవడంతో ఏదో ఒక తేదీ వేసుకున్నారని, వయోభారం కాకపోయినా ఆప్కాస్ కార్మికులను తొలగిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సిబ్బందిని నియమించి అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అరుణ, లక్ష్మి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.